
సమస్యలపై గళం వినిపించాలి



తాడిపత్రిలో అండర్ డ్రైనేజీలు నిండి రహదారులపై మురుగు నీరు



గుంతకల్లు మండలం కసాపురం రైల్వే మోరీ వద్ద ట్రాఫిక్ రద్దీ



గార్లదిన్నె మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం

- అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆశలు

తాడిపత్రి: ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో సంక్షేమ పథకాలకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనని పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ ఒక్క ఫించన్లు మినహా ఎలాంటి సంక్షేమ పథకాలను అందజేయకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. ప్రధానంగా తాడిపత్రి పట్టణంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. రోజూ దాదాపు పాతికకు పైగానే మ్యాన్ హోల్స్ వద్ద మురుగు నీరు వెళ్లేందుకు ఇబ్బందులు తలెత్తుతుండడంతో ఆయా డ్రైనేజీల వద్ద మురుగు రహదారులపై పొంగి పొర్లుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో పట్టణంలోని సగం వీధుల్లోని రహదారులు డ్రైనేజీ మురుగు నీటితో నిండిపోయినా ఆశ్చర్యపోనవసరం లేదు. ఇందుకు ఎమ్మెల్యే అసెంబ్లీలో గళం వినిపించి భారీగా నిధులు తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సాగునీటిపై ఆశలు

శింగనమల: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలు ప్రస్తావించి, పరిష్కరిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో అధిక శాతం మంది రైతులు, వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తుండడంతో సాగునీరు అందించాలని కోరుతున్నారు. ఎన్నికల సమయంలో రాచేపల్లి వద్ద ఉన్న లెదర్ పార్కును పునఃప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఎస్సీలు కావడంతో లెదర్ పార్కును పునః ప్రారంభిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఎస్సీలు భావిస్తున్నారు. మిడ్ పెన్నార్ ఐడో డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద చివరి ఆయుకట్టు భూములకు నీరు వచ్చే విధంగా చూడాలని రైతులు కోరుతున్నారు. గార్లదిన్నె మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం మరమ్మతు చేయడంతోపాటు హెచ్చెల్సీ ఉత్తర, దక్షిణ కాలువల డిస్ట్రిబ్యూటరీ ఆధునీకరణ పనులు, ఎర్రగుంట్ల వద్ద బైపాస్ కెనాల్ నిర్మాణం పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. యల్లనూరు మండలం నిట్టూరు గ్రామంలో గాలేరి–నగరి సుజల స్రవంతి ఎత్తి పోతుల పథకం ఆగిపోయిందని, దీనిని పూర్తి చేస్తే, 10 గ్రామాల వరకు సాగు, తాగునీరు సమస్య తీరుతుందన్నారు.

ప్రజా సమస్యలపై చొరవ చూపాలి

గుంతకల్లు: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా హంద్రీనీవా కాలవ ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపడంతోపాటు అవరసమైన గ్రామాలకు సాగునీరు ఇవ్వడం. ఆగిపోయిన టిడ్కో ఇళ్లను పూర్తి చేయడం, గుంతకల్లు మున్సిపాలిటీని ఆదర్శంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. హామీ మేరకు కసాపురం రైల్వే మోరీ, ధర్మవరం రైల్వే ఎల్‌గేట్‌ను తొలగించి యూ ఆకారం అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలన్నారు. ఇక గుత్తిలో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారిడంతోపాటు గుత్తి చెరువును సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుగా మార్చి తాగునీరు రోజూ అందజేయాలన్నారు. గుత్తి కోటను పర్యటక కేంద్రాంగా అభివృద్ధి పరచాలన్నారు. పామిడిలో వస్త్ర పరిశ్రమ టెక్స్‌టైల్స్ పార్కుగా మార్చడంతోపాటు నిరుపయోగంగా ఉన్న గార్మెంట్ హబ్‌ను వాడకంలోకి తేవాలని నియోజకవర్గ ప్రజలు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది



గుంతకల్లులో రోజురోజుకూ పెరిగిపోతున్న వాహదారుల సంఖ్య అనుగుణంగా రహదారులు విస్తరణకు నోచుకోవడం లేదు. దీంతో ట్రాఫిక్ సమస్యల చాలా తీవ్రంగా ఉంది. ప్రధాన రహదారితోపాటు మార్కెట్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రాకపోకలు సాగించాలంటే కష్టంగా ఉంది. ఇక కసాపురం రైల్వే మోరీ వద్ద అయితే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది. శనివారం అయితే ఈ మార్గం గుండా వెళ్లే పరిస్థితి లేదు. – వడ్డే మోహన్, గుంతకల్లు

కాలువ పనులను పూర్తి చేసి సాగు నీరందించండి



నియోజకవర్గంలోని చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టుల కింద ఉన్న నీటి సరఫరా కాలువ పనులను వెంటనే పూర్తి చేయాలి. యాడికి కాలువకు సాగు నీటిని విడుదల చేయాలి. పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే మంజూరు చేయాలి. వాటికి సంబంధించి అసెంబ్లీలో తన గళాన్ని వినిపించి నిధులు రాబట్టేందుకు ఎమ్మెల్యే కృషి చేయాలి. – రాజారామిరెడ్డి, రైతు సంఘం కార్యదర్శి, తాడిపత్రి

'గండికోట' నుంచి తాగు, సాగు నీరందించాలి



పుట్లూరు మండలంలో ఏటా వేసవిలో తాగు, సాగు నీటి సమస్య తీవ్రంగా ఉంటుంది. ఈ సమస్య పరిష్కారానికి గండికోట నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా పైప్‌లైన్ వేసి మండలంలోని పుట్లూరు, కోమటికుంట్ల, గరుగుచింతలపల్లి చెరువులతో పాటు సుబ్బరాయసాగర్‌కు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటే నీటి సమస్య నుంచి ఉపశమనం ఉంటుంది. మండలంలోని గ్రామాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.
– రామచంద్రారెడ్డి, రైతు, పుట్లూరు

పంచాయతీల అభివృద్ధికి నిధులు కేటాయించండి



తాడిపత్రి నియోజక వర్గంలో నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు అత్యధిక నిధులను కేటాయించి ఆదుకోవాలి. నిధుల లేమితో అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లడంలో నిర్లక్ష్యం చేయకుండా చూడాలి. మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుధ్యం మెరుగుకు నిధులను కేటాయించాలి. ఎన్నికల హామీలను అమలు చేయడానికి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి కృషి చేయాలి.
– ఆదిశేషారెడ్డి, న్యాయవాది, తాడిపత్రి

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



గుత్తిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తాను ఎమ్మెల్యే అయిన నెల రోజుల్లోనే తాగునీటి సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. 40 రోజులు దాటినా సమస్య అలాగే ఉంది. 20 రోజులకు ఒక్కసారి కూడా కుళాయిలకు తాగునీటిని సరఫరా చేయడం లేదు. దీంతో తాగునీటి సమస్యతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. ప్రజలకు ఇచ్చిన హామీని ఎమ్మెల్యే నిలబెట్టుకుని తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
– దాదాఖలందర్, గుత్తి

లెదర్ పార్కు పునః ప్రారంభించాలి




మా గ్రామం వద్ద లెదర్ పార్కును 30 సంవత్సరాల క్రితం ప్రారంభించి వదిలివేశారు. పార్కును పునః ప్రారంభిస్తే, ఎస్సీ యువతకు ఎంతో ఉపాధి అవకాశాలు లభిస్తాయి. నియోజకవర్గంలో ఎస్సీ జనాభా అధికంగా ఉండడం వల్ల ఈపార్కు పునః ప్రారంభించడం వల్ల ఆర్థికాభివృద్ధి చెందుతారు. ఎమ్మెల్యే శ్రావణి లెదర్ పార్కు పునః ప్రారంభానికి కృషి చేయాలి.
– సూర్యప్రకాష్, రాచేపల్లి, శింగనమల మండలం

చెరువులను నీటితో నింపాలి



బుక్కరాయసముద్రం మండలంలో 8 చెరువులు ఉన్నాయి. వీటిని సాగు నీటితో నింపేందుకు ఎమ్మెల్యే శ్రావణి కృషి చేయాలి. బీకేఎస్ మండల కేంద్రంలో చిక్కవడియార్ చెరువు నీటితో నింపాలి. తద్వారా 20 గ్రామాలకు తాగునీటి సమస్య తీరడంతోపాటు భూగర్భ జలాలు పెంపొందుతాయి. అలాగే బీకేఎస్ చెరువులో పూడికతీత పనులు చేపట్టాలి.
– శివారెడ్డి దయ్యాలకుంటపల్లి, బీకేఎస్ మండలం

మిడ్ పెన్నార్ డ్యాం గేట్లు మరమ్మతు చేయాలి



గార్లదిన్నె మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం గేట్లకు వెంటనే మరమ్మతులు చేయించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి. అలాగే దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు చేసి, 26వ డిస్ట్రిబ్యూటరీ కాలువల్లో పూడిక తీత పనులు చేసి, కంపచెట్లు తొలగించాలి. అలాగే ఆయకట్టుకు నాలుగు నెలలు నీరందించి రైతులను ఆదుకోవాలి. యర్రగుంట్ల వద్ద ఆగిపోయిన బైపాస్ కాలువ పనులు ప్రారంభించి, కాలువ ద్వారా ఆయకట్టుకు నీరు అందించాలి
– అక్బర్, రాయల సీమ రైతు సంఘం నాయకుడు, గార్లదిన్నె

అపరెల్ సెంటరును పునఃప్రారంభించండి



పామిడిలో మూతపడిన అపరల్ సెంటర్‌ను పునః ప్రారంభిచాలి. రెండో ముంబాయిగా పేరు పొందిన పామిడిలో 85శాతం మంది టైలరింగ్‌పై ఆధార పడి జీవిస్తున్నారు. మోడ్రన్ డ్రెస్‌లు తయారు చేయడంతో ఇక్కడి వారు దిట్ట. దీంతో అపరల్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురావాలి. అలాగే డ్రైనేజ్ సమస్యపై దృష్టి సారించాలి.
–పి.వరప్రసాద్, పామిడి

క్లుప్తంగా

నేడు పామిడమ్మ తేరు



అలంకరణలో పామిడమ్మ దేవత (ఫైల్)

పామిడి: పట్టణంలో మంగళవారం పామిడమ్మ తేరు నిర్వహించనున్నారు. ఏటా ఉట్ల తేరు ఉత్సవం ముగిసిన తర్వాత వచ్చే మంగళవారం రోజు పామిడమ్మ తేరు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మహిమాన్వితురాలైన పామిడమ్మను పూజించుట ద్వారా పామిడి సుభిక్షంగా ఉంటుందన్నది ఇక్కడి వారి నమ్మకం. పామిడమ్మ తేరు రోజు ఉదయం నుంచే అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసి పోతోంది. అలాగే ఆలయ ప్రాంగణంలో వెలసిన దుకాణాలకు మంచి గిరాకీ ఉంటుంది. అదేవిధంగ ఏటా యువత ఇరుసు పందేరాలతో బల ప్రదర్శన ప్రదర్శించడం ఆనవాయితీగా మారింది.

'శిక్షా సప్తాహ్' ప్రారంభం



పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షా సప్తాహ్ కార్యక్రమం ప్రారంభమైంది. హెచ్ఎం సుబహాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. రోజూ ఒక అంశం గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరిస్తామన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి

గుత్తి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గుత్తిలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్, జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్, కోశాధికారి లక్ష్మి ప్రసాద్ తదితరులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పాఠశాలలో నెలకొన్న అపరిశుభ్రతను తొలగించాలని వారు కోరారు.

23 నుంచి ఆధార్ క్యాంపులు

గుత్తి: ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 23, 24 తేదీల్లో గేట్స్ కాలేజీలో, 25న మోడల్ స్కూల్లో, 26న మున్సిపల్ కార్యాలయంలో, 27న బీసీ కాలనీ సచివాలయంలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ఆధార్ ఎన్రోల్, ఆధార్ అప్డేట్, బయోమెట్రిక్ అప్డేట్ చేస్తామన్నారు. అవకాశాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

గుత్తి: ఉరవకొండలో ఆగస్టు 6,7 తేదీల్లో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీసాయి జూనియర్ కాలేజీలో సోమవారం ఎస్ఎఫ్ఐ ప్లీనరీ సమావేశాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లీనరీలో విద్యారంగంలో నెలకొన్న సమస్యలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలు, ధన, ఈశ్వర్, జిలాన్, ప్రభా నాయక్, మహ్మద్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉరుసు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

గుంతకల్లు: మస్తానయ్య దర్గా 389వ ఉరుసు పోస్టర్లను సోమవారం దర్గా డెవలప్‌మెంట్, సేవా కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో గణాచారి బాబు రెడ్డి, జీపీ తిమ్మారెడ్డి, జీపీ మంతకల్లు రెడ్డి, కమిటీ అధ్యక్షుడు సుంకన్న, సెక్రటరీ పాండురంగ, జింకల ధనుంజయ, అల్తాఫ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్ర వాహనాల వేలం

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలోని సెబ్ స్టేషన్ ఆవరణలో బుధవారం 4 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు ఎస్ఐ సునీత సోమవారం తెలిపారు ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

కుష్టు సర్వే పక్కాగా చేపట్టండి



యంగన్నపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అధికారిణి అనుపమజేమ్స్

గుత్తి రూరల్: కుష్టు వ్యాధి సర్వే పక్కాగా చేపట్టాలని జిల్లా టీబీ, ఎయిడ్స్, కుష్టు నిర్మూలన అధికారిణి అనుపమ జేమ్స్ సూచించారు. మండలంలోని యంగన్నపల్లి, బేతాపల్లి, కొత్తపేట, జక్కలచెరువు గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు బేతాపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది చేపట్టిన ఇంటింటి సర్వేని ఆమె పరిశీలించారు. కుష్టు వ్యాధి నివారణ గుత్తి డివిజన్ అధికారి వైద్యం వెంకటేశ్వర్లుతో కలసి ఆమె గ్రామాల్లో పర్యటించారు. బేతాపల్లి పీహెచ్‌సీ వైద్యులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పరీక్షించారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. అనంతరం బేతాపల్లి పీహెచ్‌సీలో ఆమె తనిఖీ చేశారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాధుల గురించి పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సుధ, వైద్య సిబ్బంది జఫ్రుల్లా, ఆంజనేయులు, రామకృష్ణ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



గార్లదిన్నె పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎం డాక్టర్ రవిశంకర్

గార్లదిన్నె: సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవిశంకర్ సూచించారు.సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ రాకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. అలాగే మండలంలో ఇంటిం టికి వెళ్లి కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేవిధంగా చూడాలన్నారు. పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్లు గౌతమి,దిలీప్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాడికి: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతూ అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సూచించారు. మండలంలోని నిట్టూరు ఉన్నత పాఠశాల వద్ద సోమవారం డెంగీ, మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఏఎన్ఎం సరస్వతి, ఎంఎల్‌హెచ్‌పీ హర్షిత, హెచ్ఎం శివరామిరెడ్డి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి రక్షించాలి



గుత్తి డీజిల్‌షెడ్ ఆవరణలో మొక్క నాటుతున్న సీనియర్ డీఎంఈ ప్రమోద్, రైల్వే కార్మికులు

గుత్తి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ సూచించారు. గుత్తి రైల్వే డీజిల్‌షెడ్‌లో సోమవారం ఫారెస్టు అధికారులు, సిబ్బందితో కలిసి రైల్వే కార్మికులు హరిత అనంత ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా సుమారు 500 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌సి జనరల్ మనోజ్, ప్రభుదాస్, విజయానంద్, టెక్నీషియన్ రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీఓ గోపీకృష్ణ, ఏపీఓ పుల్లారెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహ ఆవరణంలో ఉపాధి సిబ్బంది ఆధ్వర్యంలో 400 మొక్కలు నాటారు.

గుంతకల్లు రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని అధికారులు సూచించారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో చెట్లు ప్రగతికి మెట్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వాస్పత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగస్వామి వసంతోత్సవం



పెద్ద విఠోబస్వామి బ్రహ్మరథోత్సవం



రుక్మిణీ పాండురంగస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలో సోమవారం డబ్బీదార్ ఫిర్కా, రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగ స్వామి వసంతోత్సవ కార్యక్రమాలను వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు రుక్మిణీ పాండురంగస్వామి రథాలను పూలతో శోభాయానంగా అలంకరించారు. స్వామి అశ్వ వాహన రథోత్సవం వెంబడి భావసార క్షత్రియ భజన బృందం భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ నగర ప్రదర్శన చేశారు. వారంరోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు వసంతోత్సవంతో ముగిశాయి. కార్యక్రమంలో ఆయా ఫిర్కాల కమిటీ సభ్యులు జవళకర్ శ్రీనివాసరావు, ఖమిత్కర్ శ్రీనివాసరావు, జవళకర్ రవీంద్రనాథ్‌రావు, గోందళే రాజశేఖర్ రావు, టీటీ నాగభూషణ్‌రావు, ఉత్తకర్ మంజునాథ్‌రావు, జే వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం పామిడమ్మ హారతి నిర్వహించనున్నట్లు ఫిర్కా సభ్యులు తెలిపారు.

నేడు బోనాల ఉత్సవం



గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఇంటి నుంచి బోనాలు ఊరేగింపుగా తీసుకుని రేణుకా ఎల్లమ్మకు సమర్పిస్తారన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు.

వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వండి

నార్పల: మండల కేంద్రంలో రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వాలని వాల్మీకి సంఘం నాయకులు సోమవారం తహసీల్దార్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడును కోరారు. ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు ఐదు వేల వాల్మీకి కుటుంబాలు నివాసం ఉంటున్నాయన్నారు. కుల దైవమైన వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు మండల కేంద్రంలో అనుమతులు ఇవ్వాలని కోరారు.

చోరీపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని పాపినేపాళ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ ఈ నెల 19న పాపినేపాళ్యంలో తాగునీరు అందించే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసి అందులో ఉన్న రాగి వైరు, ఆయిల్‌చోరీ చేశారన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

25న హుండీ కానుకల లెక్కింపు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో ఈ నెల 25న హుండీలోని కానుకలను లెక్కిస్తున్నట్లు ఈఓ నాగేంద్రుడు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై 24 వరకూ భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ అధికారుల సమక్షంలో లెక్కిస్తామన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమానికి గ్రామస్తులు, అర్చకులు, కమిటీ సభ్యులు హాజరు కావాలని ఈఓ కోరారు.

సంక్షిప్త సమాచారం

యువకుడిపై కేసు నమోదు

యల్లనూరు: చిలమకూరు మోడల్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిపై తిరుమలాపురం గ్రామానికి చెందిన యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడని కేసు నమోదు చేశామని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. వివరాల మేరకు.. చిలమకూరు గ్రామానికి చెందిన హనుమంతు మోడల్ స్కూల్ సమీపంలో చిన్న కిరాణా కొట్టు నిర్వహిస్తున్నాడు. వాటర్ ప్యాకెట్ కోసం వెళ్లిన యువకుడు ఒంటరిగా ఉన్న విద్యార్థినిపై అసభ్యంగా మాట్లాడాడని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. విచారణ అనంతరం యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించండి

యల్లనూరు: శ్మశాన వాటికకు అదనంగా స్థలాన్ని కేటాయించాలని యల్లనూరు ప్రజలు తహసీల్దారు జయ ప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీరరాజు, హౌసింగ్ ఏఈ సుప్రజ, ఏపీఎం ముత్యాలప్ప, ఏఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల సంఖ్య పెంచండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో పెరిగిన జనాభా, శివారు కాలనీ ప్రజల సౌకర్యార్థం రేషన్‌షాపుల సంఖ్యను పెంచాలని తహసీల్దార్ శేషఫణిని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్, నాయకులు వెంకటేశ్వర్లు, విశ్వనాథ్, సూర్యనారాయణ, మహేష్ తదితరులు కలసి వినతిపత్రాన్ని అందజేశారు. రేషన్ కార్డుదారులందరికీ నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు. అలాగే పట్టణంలోని పలు రద్దీ ప్రాంతాల్లో చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో ఏడీఈని కలసి బీజేపీ నాయకులు కోరారు. ఇటీవల ఆర్అండ్‌బీ సర్కిల్‌లో విద్యుత్ షాక్‌తో ఆవు మృతి చెందిన విషయాన్ని ఆయనకు వివరించారు.

వృద్ధులకు అన్నదానం

యాడికి: మండల కేంద్రంలోని అగాపే వృద్ధాశ్రమంలో సోమవారం తాడిపత్రికి చెందిన దినేష్ అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు బత్తుల ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రామన్న, మోషే, ప్రశాంత్, పౌలు, ప్రతాప్, శ్రీదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి పూజలు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన కాశీ విశ్వేశ్వరుని ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయాన్నే మహా శివుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో భక్తులు దీపాలు పెట్టి అర్చనలు అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.